సాక్షి
ఖమ్మం
మంగళవారం । 2 । సెప్టెంబర్ । 2025





**మహిళా అభ్యున్నతిపై దృష్టి**
మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా పథకాల అమలుపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. 10లో



**ఆర్టీసీ బస్సు, లారీ ఢీ**
వైరా మండలం స్టేజీ పినపాక వంతెనపై ఆర్టీసీ బస్సు – లారీ ఎదురెదురుగా ఢీకొనగా పలువురికి గాయాలయ్యాయి. 10లో




**వాతావరణం**
మంగళవారం జిల్లావ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో వర్షం కురిసే సూచనలు ఉన్నాయి.

## న్యూస్‌రీల్

### ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీగా జ్యోతి

**ఖమ్మంమయూరిసెంటర్:** షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.జ్యోతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. డీడీగా ఉన్న కస్తాల సత్యనారాయణ ఉద్యోగ విరమణ చేయడంతో జ్యోతికి ఆ బాధ్యతలు అప్పగించగా, సోమవారం ఆమె విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎక్కిరాల శ్రీనివాస్, రహీమొద్దీన్, సముద్రాల శ్రీనివాస్, వి.వెంకటేశ్వర్లు, వేముల శంకర్, అస్లాం ఖాన్, చంద్రశేఖర్, భాస్కర్ తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

### నేటి నుంచి 'సూర్యఘర్'పై అవగాహన

**ఖమ్మంవ్యవసాయం:** సౌర విద్యుత్ ఉత్పత్తి, వాడకాన్ని ప్రోత్సహించేలా రూపొందించిన ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై ఎంపిక చేసిన గ్రామాల్లో మంగళవారం నుంచి విద్యుత్, రెడ్‌కో అధికారులు అవగాహన కల్పించనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని అమలు చేస్తోంది. నిబంధనల ఆధారంగా జిల్లాలోని తల్లాడ, అన్నారుగూడెం, కొణిజర్ల, తనికెళ్ల, నేలకొండపల్లి, ముదిగొండ, వల్లభి, కందుకూరు గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో రూ.2.20 లక్షల విలువైన 3కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.78 వేల సబ్సిడీ ఇస్తే లబ్ధిదారులు రూ.1.40 లక్షలు భరించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు వచ్చేనెల అక్టోబర్ 3వరకు అవకాశం ఉండగా, అత్యధిక సామర్థ్యంతో ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే గ్రామాలకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా రూ.కోటి నిధులు అందిస్తుంది. ఈ నిధులతో ప్రభుత్వ కార్యాలయాలకు సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవచ్చు.

**సదస్సుల షెడ్యూల్ ఇలా..**

పీఎం సూర్యఘర్ పథకంపై మంగళవారం నుంచి నిర్వహించే అవగాహన సదస్సులకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఈమేరకు మంగళవారం అన్నారుగూడెం, తల్లాడలో, బుధవారం తనికెళ్ల, కొణిజర్ల, గురువారం నేలకొండపల్లిలో, శుక్రవారం ముదిగొండ, వల్లభితో పాటు శనివారం కందుకూరులో సదస్సు నిర్వహిస్తామని వెల్లడించారు.

### రోడ్లు, ఎత్తిపోతల పథకానికి రూ.15 కోట్లు

**కల్లూరురూరల్:** కల్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో బీటీ రోడ్లు, ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పేరువంచ నుండి పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల వరకు బీటీ రోడ్డ నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరు చేశారు. ఈ రహదారి నిర్మాణంతో ఆయా గ్రామాల ప్రజలు, రైతులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. అలాగే, నారాయణపురం, కొత్త నారాయణపురం గ్రామాల్లో భూములకు సాగునీరు అందించేలా సాగర్ కాల్వపై ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.2కోట్లు కేటాయించారు. అంతేకాక నారాయణపురం – పేరువంచ మధ్య బీటీ రోడ్డుకు రూ.2 కోట్లు, నారాయణపురం – కొర్లగూడెం, ఆపై రామకృష్ణపురం వరకు రహదారి నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేశారు. కాగా, నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఇందుకు కృషి చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### బియ్యం పంపిణీ పరిశీలన



షాప్‌లో తనిఖీ చేస్తున్న డీటీ విజయ్‌బాబు

**ఖమ్మం సహకారనగర్:** జిల్లావ్యాప్తంగా మూడు నెలల బియ్యాన్ని రేషన్ షాప్‌ల ద్వారా జూన్‌లో పంపిణీ చేశారు. మళ్లీ ఈనెల నుంచి యథావిధిగా పంపిణీ చేస్తుండగా జిల్లాలోని పలు షాప్‌లను సోమవారం అధికారులు తనిఖీ చేశారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ ఆధ్వర్యాన తనిఖీలు జరగగా, బియ్యం పంపిణీ సాఫీగా జరిగేలా డీలర్లకు సూచనలు చేశారు. కొత్తగా కార్డులు మంజూరైన 41,615కార్డులపై ఈనెల నుంచి బియ్యం ఇస్తున్నట్లు డీసీఎస్‌ఓ తెలిపారు. జిల్లాలో దాదాపు 35వేల మంది కార్డుదారులు పోర్టబులిటీ ద్వారా 2వేల మెట్రిక్ టన్నుల బియ్యం తీసుకుంటున్నారని చెప్పారు. ఎక్కడైనా డీలర్లు ఇబ్బంది పెడితే ఫిర్యాదు చేయాలని సూచించారు.

### 'టీచర్స్ డే'కు నిధులు

**ఖమ్మం సహకారనగర్:** సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో కార్యక్రమ నిర్వహణకు నిధులు కేటాయించారు. జిల్లా స్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవ నిర్వహణకు రూ.15వేలు, ఒక్కో మండలానికి రూ.5వేలు కేటాయిస్తున్నట్లు అందులో వెల్లడించారు.

# విడవని వాన..



అలుగు పోస్తున్న సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువు

**జిల్లాలో 5.2 సెం.మీ. వర్షపాతం నమోదు**

- వాగులు, వంకలు ఉప్పొంగడంతో నిలిచిన రాకపోకలు
- భారీ, మధ్య తరహా రిజర్వాయర్లలోకి భారీగా వరద
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** జిల్లాను వర్షం వీడడం లేదు. ఆదివారం ఉదయం 8–30నుంచి సోమవారం ఉదయం 8–30 గంటల వరకు 5.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా పలుచోట్ల పంట పొలాలు నీటమునిగాయి. అలాగే, వాగులు, వంకల నీరు రహదారులపైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వరద ఉధృతి ఉన్నచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరోపక్క జిల్లాలోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు చేరింది.



కామేపల్లి మండలం మర్రిగూడెం పాఠశాల్లోకి నీరు చేరడంతో విద్యార్థుల అవస్థ

**రెండు మండలాల్లో అత్యధికం**

జిల్లాలోని ఖమ్మంరూరల్, తల్లాడలో అత్యధికంగా 7.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, వైరాలో 7.3, కొణిజర్లలో 6.9, రఘునాథపాలెం మండలంలో 6.8 సెం.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు వెల్లడించారు. జిల్లాలోని 21 మండలాల్లో వర్షం ప్రభావం కారణంగా స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా వాగుల వరద వంతెనలు, లో లెవల్ చప్టాల పైనుంచి ప్రవహించడంతో పలు గ్రామాల నడుమ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

**పోలీసుల పహారా**

వరద ప్రవహిస్తున్న రహదారులు, లోలెవల్ చప్టాల పైనుంచి ప్రజలు రాకపోకలు సాగించకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఖమ్మం మున్నేటికి వరద పెరుగుతుండడంతో పోలీసులు పహారా కాస్తున్నారు. అలాగే, ఖమ్మం – బోనకల్ రహదారిపైకి వరద చేరిన నేపథ్యాన రాకపోకలు నిలిపేశారు. కారేపల్లి మండలం పేరుపల్లి నుంచి మాదారం వెళ్లే రోడ్డులో బుగ్గవాగు ఉధృతి కారణంగా సమీప డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి వరద చేరుతుండగా స్థానికులను అధికారులు వాహనాల్లో పునరావాస కేంద్రానికి తరలించారు.

**రిజర్వాయర్లలో ఇలా..**

- పాలేరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటినిల్వ సామర్థ్యం 23 అడుగులకు గాను ప్రస్తుత నీటి మట్టం 21.15 అడుగులుగా ఉంది. ఎగువ నుంచి 3,606 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అందులో నాగార్జునసాగర్ నుంచి 2,376 క్యూసెక్కులు ఉంది. దీంతో 3,084 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.
- వైరా రిజర్వాయర్ 18.3అడుగులకు గాను 19.02 అడుగులకు చేరింది. 4,131 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, అదేస్థాయిలో ఔట్‌ఫ్లో నమోదవుతోంది.
- లంకాసాగర్ ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 16 అడుగులకు 17.3 అడుగులుగా నమోదైంది.
- తీర్థాల వద్ద మున్నేరు 17.25, కాల్వొడ్డు వద్ద 14 అడుగులుగా ఉంది.
- బేతుపల్లి కాల్వ 16 అడుగులకు గాను 18 అడుగులకు చేరి అలుగు పోస్తోంది.
- జిల్లాలోని 1,061 చెరువుల్లో 450 చెరువులు అలుగు పోస్తుండగా, 387 చెరువుల్లో 90 – 100 శాతం మేర నీరు చేరింది.


**రాకపోకలకు అంతరాయం..**

జిల్లాలోని పలు మండలాల్లోని వాగులు పొంగి వంతెనలపై నుంచి ప్రవహిస్తుండడంతో వివిధ గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. రఘునాథపాలెం మండలం పాపటపల్లి – వీఆర్ బంజర మధ్య బుగ్గవాగు పొంగి వంతెనపైకి వరద చేరింది. అలాగే, రఘునాథపాలెం బైపాస్‌రోడ్డు సాగర్ కాల్వ వద్ద వరద పోటెత్తింది. కొణిజర్ల మండలం తీగల బంజరలో పగిడేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షానికి ఏన్కూరు మండలం రేపల్లెవాడ – నాచారం మధ్య వాగు పొంగింది. అలాగే జన్నారం – అంజనాపురం మధ్య వాగు ప్రవాహంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వైరా మండలం పాలడుగు – వల్లాపురం గ్రామాల మధ్య వాగు ప్రవాహంతో అదే పరిస్థితి నెలకొంది. చింతకాని మండలం రామకృష్ణాపురం వద్ద ఖమ్మం – బోనకల్ ప్రధాన రహదారిపై వరదనీరు ప్రవహిస్తోంది. అలాగే, బోనకల్ మండలం పెద్దబీరవల్లి రహదారిపై పెద్దవాగు పొంగి పొర్లుతోంది. ఇక తల్లాడ మండలం బిల్లుపాడు – రామచంద్రాపురం మధ్య ఉన్న మాచవరం వాగు ఉధృతితో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.



బోనకల్ మండలం పెద్దబీరవల్లి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద

# పల్లెల్లో ఎన్నికల సందడి !



- సమరానికి సిద్ధమవుతున్న పార్టీలు
- పోటీ చేసేందుకు ఆశావహుల ఏర్పాట్లు
- నేడు జీపీ ఓటర్ల తుది జాబితా ప్రకటన
- 10న పరిషత్ ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితా విడుదల

**సాక్షిప్రతినిధి, ఖమ్మం:** గ్రామాల్లో ఎన్నికల హడావుడి మొదలైంది. నిన్నామొన్నటి వరకు పంచాయతీ, పరిషత్ ఎన్నికల నిర్వహణపై స్పష్టత లేక ఆశావహులు స్తబ్ధుగా ఉన్నారు. ఇంతలోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘానికి లేఖ రాయడంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గ్రామపంచాయతీల్లో వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాను మంగళవారం, ఎంపీటీసీ, జెడ్పీటీసీ తుది ఓటర్లు, పోలింగ్ కేంద్రాల జాబితాను 10వ తేదీన ప్రకటించనున్నారు. ఇలా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమవుతండగా.. పోటీకి సై అంటున్న ఆశావహులు సైతం అన్ని అంశాలను బేరీజు వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు.

**ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్**

గ్రామపంచాయతీ పాలక వర్గాలతోపాటు జిల్లా, మండల పరిషత్‌ల గడువు ముగిసి ఏడాది పూర్తయింది. అప్పటి నుంచి సాంకేతిక చిక్కుముడులతో ఎన్నికల నిర్వహణలో ఆలస్యం జరుగుతోంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను ప్రకటించింది. కానీ గవర్నర్ ఆమోదం లేక సందేహాలు వ్యక్తమైనా అసెంబ్లీలో పురపాలికలు, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఆమోదించారు. ఇదే సమయాన ప్రభుత్వం ఎన్నికల సంఘానికి లేఖ రాయడంతో జీపీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ లభించినట్లయింది.

**లెక్క తేలనున్న ఓటర్లు**

గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితా మంగళవారం విడుదల కానుంది. ఇక 6వ తేదీన ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల వారీగా ఓటర్లు, పోలింగ్‌కేంద్రాల ముసాయిదా విడుదల చేసి అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం అనంతరం 10న తుది జాబితాను విడుదల చేస్తారు. దీంతో తొలి అంకం ముగుస్తుంది.

**పార్టీల్లో కదలిక**

గ్రామపంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎప్పటికప్పుడు ఆలస్యమవుతుండడంతో నేతలు పెద్దగా దృష్టి సారించలేదు. కానీ అధికార కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలతో మంత్రులు, ప్రజాప్రతినిధులు సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. బీఆర్‌ఎస్ అడపా దడపా సమావేశాలు నిర్వహించినా.. బీజేపీ, వామపక్ష పార్టీలు ఎన్నికలపై సీరియస్‌గా దృష్టి పెట్టలేదు. ఆ తర్వాత అంతటా స్తబ్దత నెలకొంది. ఇంతలోనే ఎన్నికల అంశం తెరపైకి రాగా పార్టీల్లో కదలిక వచ్చింది. ప్రధానంగా కాంగ్రెస్ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గెలుపు కోసం వ్యూహాలను రచిస్తోంది. ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్‌ఎస్ సైతం ఇప్పుడిప్పుడే ఎన్నికలను ఎదుర్కొనే పనిలో పడింది.

**ఆశావహుల సందడి**

ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతోందని తెలియగానే ఆశావహుల్లో ఆశలు చిగురించాయి. కాంగ్రెస్‌లోని ఆశావహులు ఎక్కడి నుంచి పోటీ చేయాలి.. పరిషత్ ఎంచుకోవాలా, జీపీ ఎంచుకోవాలా అన్న అంశంపై సమాలోచనలు జరుపుతున్నారు. కొందరు ఓటరు జాబితాల ఆధారంగా తమకు ఎక్కడ అనుకూలంగా ఓట్లు ఉన్నాయో సరి చూసుకుంటున్నారు. చాలా మంది గ్రామాల్లో పట్టుకోసం సర్పంచ్‌లుగా పోటీ చేయాలనే భావనతో ఉన్నట్లు తెలిసింది. ఇక జెడ్పీటీసీ, ఎంపీటీసీలుగా పోటీ చేయాలనుకునే వారు టికెట్ల కోసం నేతలు, మంత్రులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. పరిషత్ ఎన్నికలు సెప్టెంబర్‌లో, పంచాయతీ ఎన్నికలు అక్టోబర్‌లో జరుగుతాయనే ప్రచారం జరుగుతుండగా.. అటు అధికారులు, ఇటు ఆశావహులు పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు.

# ఫిర్యాదులు పరిష్కరించండి

- తిరస్కరిస్తే కారణాలు వెల్లడించాలి
- అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం సహకారనగర్:** ప్రజలు అందిస్తున్న ప్రతీ ఫిర్యాదు, వినతిపత్రాన్ని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో భాగంగా సోమవారం వారు కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమైన అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఒకవేళ ఏవైనా తిరస్కరిస్తే అందుకు కారణాలను దరఖాస్తుదారులకు తెలియచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్వో పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, డీఆర్‌డీఓ సన్యాసయ్య, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**ఫిర్యాదుల్లో కొన్ని...**

- సింగరేణి మండలం విశ్వనాథపల్లి జీపీ, లింగం బంజర గ్రామస్తులు గతం నుంచి ఉన్న రోడ్డును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.
- ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లకు చెందిన జి.సత్యనారాయణ పుట్టకోట చెరువు 50 ఎకరాల మేర ఆక్రమణకు గురైనందున ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవడంతో పాటు చెరువు ఆధునికీకరణ పనులు చేపట్టాలని కోరారు.
- కామేపల్లి మండలం రేపల్లెవాడలో తేజావత్ రవి పేరిట ఇద్దరు ఉండగా ఒకరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైందని చెప్పడంతో నిర్మాణం మొదలుపెట్టాడు. కానీ మరో వ్యక్తి ఖాతాలో రూ.లక్ష జమ కావడంతో వివాదం మొదలైంది. ఈమేరకు నిధులు జమ అయిన రవి తనకే ఇల్లు మంజూరైనా అధికారులు మభ్యపెడుతున్నారంటూ కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడు. అంతేకాక ఎంపీడీఓ తనకు ఫోన్ చేసి ఖాతాలో జమ అయిన నగదు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు వాపోయాడు.

# హామీలు నెరవేర్చకపోతే ఉద్యమాలు



కలెక్టరేట్ వద్ద నిరసనలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు

**ఖమ్మం సహకారనగర్:** ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని జిల్లా ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పెన్షన్ విద్రోహ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించిన నిరసనలో ఆయన మాట్లాడారు. కొత్త పింఛన్ విధానంలో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నందున వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. టీజీవోస్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శులు మోదుగు వేలాద్రి, కొణిదెన శ్రీనివాస్, రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంబూరు సునీల్‌రెడ్డి, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మల్లెల రవీంద్రప్రసాద్, పారుపల్లి నాగేశ్వరరావు, కళ్యాణం కృష్ణయ్య, సుబ్బయ్య, ఫణిరాజ్, పరిశ పుల్లయ్య, కళ్యాణం నాగేశ్వరరావు, జెడ్.ఎస్.జైపాల్, గంగవరపు బాలకృష్ణ, పి.విజయ్‌కుమార్, శేషుప్రసాద్, చంద్రకంటి శ్రీధర్, విజయ్, నాగేశ్వరరావు, వెంగళరావు, మనోహర్ రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యాన సైతం నిరసన తెలపగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. కాగా, సీపీఎస్‌ను రద్దు చేయాలనే డిమాండ్‌తో సోమవారం హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు వెళ్తున్న నాయకులను అక్రమంగా అరెస్టు చేశారని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా శేఖర్‌రావు, ఆర్.రంగారావు ఆరోపించారు.

# నిమజ్జనం సాఫీగా సాగేలా...

- జిల్లా కేంద్రంలో సిద్ధమవుతున్న నిమజ్జన ఘాట్లు
- 15 క్రేన్లు, మూడు జేసీబీలతో పాటు 300 మంది గజ ఈతగాళ్లు
- ఘాట్ల వద్ద ఏర్పాట్లపై అధికారుల పరిశీలన



ఘాట్ వద్ద లైట్ల బిగింపునకు చేస్తున్న ఏర్పాట్లు (ఇన్‌సెట్) ప్రకాశ్‌నగర్ ఘాట్ వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్

**ఖమ్మంమయూరిసెంటర్:** వినాయక నవరాత్రోత్సవాల మాదిరిగానే జిల్లా కేంద్రంలో నిమజ్జనం కూడా సాఫీగా ముగిసేలా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇందుకోసం వివిధ శాఖల అధికారులు, ఉత్సవ సమితి బాధ్యులతో సమన్వయం చేసుకుంటున్నారు. ఈనెల 6వ తేదీన గణపతి విగ్రహాల శోభాయాత్ర, నిమజ్జనం చేయాలని ఇప్పటికే నిర్ణయించారు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రధాన ఘాట్ల వద్ద భక్తులు ఇబ్బంది పడకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఘాట్ల వద్ద రహదారుల ఆధునికీకరణ, ఇతర ఏర్పాట్ల కోసం రూ.15 లక్షలు అవసరమని అంచనా వేశారు. అయితే, మున్నేటికి వరద వస్తుండడంతో ఘాట్ల వద్ద అప్రోచ్ రహదారులపై మట్టి కొట్టుకుపోతుండగా.. అంచనా వ్యయం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

**భారీ యంత్రాల వినియోగం**

ఈ ఏడాది ఖమ్మంలో చిన్నాపెద్ద కలిపి 1,500 గణపతి విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేసినట్లు అంచనా. వీటి నిమజ్జనం కోసం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యాన కాల్వొడ్డు (బొక్కల గడ్డ), ప్రకాశ్‌నగర్ మున్నేరు బ్రిడ్జి వద్ద ఘాట్లను సిద్ధం చేస్తున్నారు. విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడానికి 15 క్రేన్లు ఏర్పాటు చేస్తుండగా బొక్కలగడ్డ వద్ద 11, ప్రకాశ్‌నగర్ వద్ద మిగతావి అందుబాటులోకి తీసుకొస్తారు. అంతేకాక విగ్రహాలను నీటిలోకి నెట్టేందుకు మూడు జేసీబీలను ఏర్పాటుచేస్తారు. తద్వారా నిమజ్జనం వేగంగా జరుగుతుందని.. భక్తుల రద్దీని నియంత్రించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

**పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు**

నిమజ్జన ఘాట్ల వద్ద భద్రతకు అధికారులు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తూనే ప్రమాదాల నియంత్రణకు 300 మంది గజ ఈతగాళ్లను నియమించారు. ఇందులో 250 మందికి బొక్కల గడ్డ వద్ద, 50 మంది ప్రకాశ్‌నగర్ వద్ద విధులు కేటాయిస్తారు. అలాగే, బొక్కలగడ్డ ఘాట్ వద్ద 14 సీసీ కెమెరాలు, రెండు ఘాట్ల వద్ద హైమాస్ట్, ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేయనున్నారు. ఘాట్ల వద్దకు, మున్నేరుకు వెళ్లే పరిసరాల్లో ఈ లైట్లను అమర్చనున్నట్లు తెలిసింది. ఇక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కూడా అవసరమైన సహకారాన్ని అందిస్తారు.

**ఘాట్లను పరిశీలించిన కమిషనర్**

కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం నిమజ్జన ఘాట్లను పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. శోభాయాత్ర, నిమజ్జనం చూసేందుకు వచ్చే భక్తుల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. నగరంలోని అన్ని రోడ్లవెంట చెట్ల కొమ్మలు అడ్డు రాకుండా ముందుగానే తొలగించాలని సూచించారు. అలాగే, మ్యాన్‌హోళ్లను మూసివేయాలని తెలిపారు. ఇక వర్షాలు, వరదలతో దెబ్బతిన్న అప్రోచ్ రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయిస్తున్నామని వెల్లడించిన కమిషనర్.. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనం ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

# పంట నష్టాలపై సమగ్ర సర్వే

**ఖమ్మంవ్యవసాయం:** అధిక వర్షాలతో జరిగిన పంట నష్టంపై సర్వే చేయాలని ప్రభుత్వం సోమవారం ఆదేశించింది. ఇటీవల కొద్ది రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తుండగా పంటలకు నష్టం ఏర్పడింది. జిల్లాలో ప్రస్తుతం 2,84,517 ఎకరాల్లో వరి, 2,25,613 ఎకరాల్లో పత్తి సహా వివిధ పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా వరి, పత్తి, పెసరకు నష్టం ఏర్పడిందని వ్యవసాయ శాఖ అధికారులు గుర్తించారు. పత్తిలో పూత, కాత రాలిపోతుండగా, తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఇక చేతికందే దశలో పెసరకు నష్టం కలుగుతోంది. దుబ్బ దశలో ఉన్న వరి పొలాల్లో ఎక్కువ రోజులు నీటి నిల్వ కారణంగా తెగుళ్లు ఆశిస్తున్నాయి. ఈ నేపథ్యాన పంట నష్టాలపై సర్వే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఏఈఓలు మంగళవారం నుంచి క్షేత్రస్థాయిలో సర్వే చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య ఆదేశించారు. ఇప్పటికే కూసుమంచి, తల్లాడ, ఎర్రుపాలెం, ఖమ్మం అర్బన్, రఘునాథపాలెం, ఏన్కూరు, ఖమ్మం రూరల్ మండలాల్లో 3,644 ఎకరాల మేర పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే నిబంధనల ప్రకారం 33 శాతం పంట నష్టం జరిగితేనే ప్రభుత్వ పరిహారానికి సిఫారసు చేస్తారు. ఇందుకోసం వ్యవసాయ విస్తర్ణాధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేసి పంట నష్టాన్ని గుర్తించాల్సి ఉంటుంది. ఆపై నివేదికలను వారంలోగా సమర్పించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.



పత్తి చేనును పరిశీలిస్తున్న డీఏఓ, అధికారులు (ఫైల్)

## క్లుప్తంగా

### జీవాల్లో వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి



అధికారికి వినతిపత్రం ఇస్తున్న యాదవ మహాసభ నాయకులు

ఖమ్మంవ్యవసాయం: జీవాల్లో సీజనల్ వ్యాధుల నివారణపై దృష్టి సారించాలని అఖిల భారత యాదవ మహాసభ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పశు సంవర్ధక, పశువైద్యాధికారి డాక్టర్ బి.పురంధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మహాసభ గౌరవ అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్య మాట్లాడుతూ జీవాలు నీలినాలుక, గొంతువాపు వ్యాధి, చిటుక వ్యాధి, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడుతుండగా ప్రభుత్వ పరంగా సరైన వైద్యం అందడం లేదని తెలిపారు. దీంతో ప్రైవేట్ మెడికల్ షాపుల యజమానులు దోపిడీ చేస్తున్నందున అధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిత్తూరి సింహాద్రి, చేతుల నాగేశ్వరరావు, మొరిమేకల కోటయ్య, తోడేటి లింగరాజు, వాకధాని కోటేశ్వరరావు, వలరాజు, ప్రభాకర్, రవి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### 7,8వ తేదీల్లో రోలర్ స్కేటింగ్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి రోలర్ స్కేటింగ్ జట్ల ఎంపిక ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈనెల 7,8వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.వెంకటరామకృష్ణ, ఐ.రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ వివరాలను ఈనెల 3వ తేదీలోపు కోచ్ కె.సురేష్(99123 99211)కు అందించాలని సూచించారు. ఇక్కడ ప్రతిభ చూపే క్రీడాకారులను రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు.

### హెమటాలజీ అనలైజర్ల కోసం టెండర్లు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు ఆటోమేటెడ్ హెమటాలజీ అనలైజర్లు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. పెనుబల్లి, సత్తుపల్లి, మధిర, వైరా ఆస్పత్రులకు యంత్రాలు సరఫరా చేసేందుకు ఈ నెల 10వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. రూ.500 డీడీని 'సూపరింటెండెంట్, డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్ హాస్పిటల్, ఖమ్మం' పేరిట చెల్లించి కలెక్టరేట్‌లోని డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో దరఖాస్తులు తీసుకోవచ్చని తెలిపారు.

### ఏఎంఓగా శైలేంద్ర

ఖమ్మం సహకారనగర్: విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంఓ)గా శైలేంద్ర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన అదనపు కలెక్టర్, డీఈఓ శ్రీజను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా, ఏఎంఓగా బాధ్యతలు స్వీకరించిన శైలేంద్రకు డీఈఓ కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

### ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా వెంకటేశ్వర్లు



పి.వెంకటేశ్వర్లు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా పునాటి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. చింతకాని జిల్లా పరిషత్ స్కూల్ ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను రెండేళ్ల కాలానికి ఈ పదవిలో నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఈ సందర్భంగా పలువురు పీఈటీలు, పీడీలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

### గ్యాస్ లీకేజీతో మంటలు

బోనకల్: బోనకల్ మండలంలోని చొప్పకట్లపాలెంలో సోమవారం గ్యాస్ లీకేజీ కారణంగా సిలిండర్ పేలడంతో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన తన్నీరు వెంకట్రావమ్మ ఆదివారం రాత్రి వంట చేశాక గ్యాస్ బంద్ చేయడం మరిచిపోయింది. ఆమె సోమవారం ఉదయం వంట చేయడానికి లైటర్ వెలిగించగా అప్పటికే గ్యాస్ లీక్ అయి ఉండడంతో సిలిండర్ పేలింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వెంకట్రావమ్మను 108 సిబ్బంది బాను సహాస్, మిథున్ చక్రవర్తి ప్రథమ చికిత్స చేసి ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

### ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

| | గరిష్ట | కనిష్ట |
|---|---|---|
| పెసలు | 6,500 | 3,200 |
| కందులు | 5,900 | 5,900 |
| ఏసీ మిర్చి | 15,450 | 8,000 |
| మిర్చి | 8,000 | 5,000 |
| పత్తి | 7,700 | 6,800 |

– ఖమ్మం వ్యవసాయం

### పామాయిల్ గెలలు

టన్ను ధర రూ.19,107



కామేపల్లి : బుగ్గవాగు వరద ఉధృతిని పరిశీలిస్తున్న పోలీసులు



రఘునాథపాలెం : వీఆర్ బంజర - పాపటపల్లి మధ్య బుగ్గవాగు ప్రవాహం



ఖమ్మం క్రైం : మున్నేటి తీరాన పోలీసుల బందోబస్తు



చింతకాని : రామకృష్ణాపురం వద్ద రహదారిపై వరదలో వెళ్తున్న స్థానికులు



సత్తుపల్లిరూరల్ : రుద్రాక్షపల్లి చప్టాపై చేపలు పడుతున్న గ్రామస్తులు



తల్లాడ : మిట్టపల్లి వద్ద గంగదేవిపాడు వాగు ప్రవాహం



కొణిజర్ల : తీగలబంజర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పగిడేరు

## అదే వర్షం.. ఆపై వరద

జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి వరకు వాతావరణం ప్రశాంతంగానే ఉంది. ఆపై అర్ధరాత్రి ఒక్కసారిగా మొదలైన వాన సోమవారం తెల్లవారుజాము వరకు దంచి కొట్టింది. దీంతో పలుచోట్ల వాగులు, చెరువుల్లోకి భారీగా వరద చేరి ఉప్పొంగాయి. అంతేకాక రహదారులు, లోలెవల్ చప్టాలపైకి వరద చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే, లోతట్టు ప్రాంతాల్లోని పలువురి ఇళ్లలో నీరు చేరడంతో ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఇక కామేపల్లి మండలం మద్దిగూడెంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పక్కపక్కనే ఉండగా ఆవరణతో పాటు గదుల్లోకి నీరు చేరడంతో పిల్లలు అవస్థ పడ్డారు. ఇంకొన్ని చోట్ల పంటల పొలాల్లో వరద చేరగా పంట నష్టంపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. – సాక్షి నెట్‌వర్క్



ఏన్కూరు : రేపల్లెవాడ - నాచారం మధ్య వాగు ప్రవాహం



కారేపల్లి : పేరుపల్లి వాసులను పునరావాస కేంద్రానికి తరలిస్తున్న అధికారులు



వైరారూరల్: అష్టగుర్తి-తూటికుంట్ల గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగు

## మున్నేరుకు మరోసారి వరద



వెంకటేశ్వరనగర్ వాసులను అప్రమత్తం చేస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: గతేడాది సెప్టెంబర్ 1న ప్రళయం సృష్టించిన మున్నేరు ఈ ఏడాది ఇప్పటివరకు శాంతంగానే ఉన్నా... పరీవాహకంలో భారీ వర్షాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వారం క్రితం కాల్వొడ్డు వద్ద 15.10 అడుగుల మేర ప్రవహించిన మున్నేరు ఆతర్వాత తగ్గినా మళ్లీ సోమవారం అదే స్థాయికి చేరింది. ఆదివారం రాత్రి ఖమ్మంకు ఎగువన మున్నేరు పరీవాహక ప్రాంతాల్లో దాదాపు 10 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో సోమవారం మున్నేరుకు వరద పెరగగా ఉదయం 8గంటలకు కాల్వొడ్డు వద్ద 9.10 అడుగుల మేర ఉన్న నీటిమట్టం రాత్రి 8 గంటలకల్లా 14.90 అడుగులకు పెరిగింది. దీంతో కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను అప్రమత్తం చేశారు. అయితే, డోర్నకల్, పాలిశెట్టిగూడెం అక్వాడెక్టులు, తీర్థాల వద్ద మున్నేరు పెరుగుతున్నట్లు కనిపించినా ఆ తర్వాత నిలకడగా ఉండడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాల్వొడ్డు వద్ద వరద 15 అడుగుల వరకు చేరాక తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. కాగా, రాత్రి వరద పెరిగితే వెంకటేశ్వరనగర్ చర్చిలో అలారం మోగిస్తామని, ఆ వెంటనే ప్రజలు అప్రమత్తమై ఇళ్ల నుండి బయటకు రావాలని ఆర్డీఓ నర్సింహారావు సూచించారు. మున్నేటి పరీవాహక ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం ఆయనతోపాటు ఎస్‌ఈ రంజిత్, ఈఈ కృష్ణాలాల్, ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఉద్యోగులు పర్యటించారు.

## వాసవీ గణపతికి మహా నైవేద్యం



సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వాసవీ గణపతికి సోమవారం స్వామికి 108 రకాల వంటకాలతో మహానైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా స్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ బాధ్యులువందనపు సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీధర్, పోలిశెట్టి శివకుమార్, సత్తిబాబు, గందు ఉమ తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్ల ఘనత కాంగ్రెస్‌దే..

పార్టీ జిల్లా కార్యాలయంలో సంబురాలు



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నేతలు బీసీలను అణగదొక్కితే.. రిజర్వేషన్ల అమలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీ ఆమోదించిన సందర్భంగా ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేసి టపాసులు కాల్చారు. అనంతరం వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కొండబాల కోటేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావుతో పాటు పార్టీ, అనుబంధ విభాగాల నాయకులు నాగండ్ల దీపక్‌చౌదరి, నూతి సత్యనారాయణ, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, కట్ల రంగారావు, యర్రం బాలగంగాధర్‌తిలక్, చోటాబాబా, వడ్డెబోయిన నరసింహారావు, హారికా నాయుడు, కమర్తపు మురళి, కన్నం వైష్ణవిప్రసన్న కృష్ణ, కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, సాధు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## కుప్పకూలిన షాప్ ముందు భాగం



కూలిన ఇంటి ముందు భాగం

నేలకొండపల్లి: వరుస వర్షాలతో నానడంతో శిథిలావస్థలో ఉన్న షాప్ ముందు భాగం కుప్పకూలింది. అయితే, ఆ సమయాన ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. నేలకొండపల్లికి శ్రీనివాసరావు అద్దె ఇంట్లో కిరాణం షాపు నిర్వహిస్తున్నాడు. శిథిలావస్థలో ఉన్న ఆ ఇంటి గోడలు ఇటీవల వర్షాలకు నానడంతో సోమవారం ఉదయం షాప్ తీస్తుండగా ఇంటి ముందు భాగం కుప్పకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పగా, సదరు వ్యాపారి వెంటనే ఇల్లు ఖాళీ చేశారు.

## ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

15 మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు



ఘటనాస్థలంలో ఆర్టీసీ బస్సు, లారీ

వైరారూరల్: మండలంలోని స్టేజీ పినపాక హైలెవల్ వంతెనపై సోమవారం ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొని 15 మంది గాయపడ్డారు. వివరాలు ఇలా.. మణుగూరు డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ సర్వీసు సుమారు 30 మంది ప్రయాణికులతో మణుగూరు నుంచి ఖమ్మం వస్తోంది. అదే సమయంలో లారీ వైరా వైపు నుంచి తల్లాడ వైపు వెళ్తోంది. ఈ క్రమంలో స్టేజీ పినపాక హైలెవల్ వంతెనపై బస్సు, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో రెండు వాహనాలు అతివేగంగా ఉండడంతో బస్సు డ్రైవర్ విజయ్ సహా బస్సులో ఉన్న 15 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, సీఐ ఎన్.సాగర్, ఎస్సై పి.రామారావు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108లో ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులకు మూడు గంటల సమయం పట్టగా అంతసేపు వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.

## మహిళా అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి

- పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలాల ఎంపిక
- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంమయూరిసెంటర్: మహిళల అభ్యున్నతికి ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రణాళికాయుతంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆమె తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, కొత్త స్వశక్తి సంఘాల ఏర్పాటు, బ్యాంకు లింకేజీ రుణాలు, ఏకరూప దుస్తుల తయారీ, ఎర్రుపాలెం, కల్లూరులో సోలార్ ప్యానళ్ల ఏర్పాటు, పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుపై సమీక్షించారు. అక్షరాస్యత పెంచే దిశగా పదో తరగతి ఉత్తీర్ణత సాధించని మహిళలను గుర్తించి ఓపెన్ స్కూల్ సొసైటీలో నమోదు చేయాలని తెలిపారు. ఏపీఎంల వారీగా లక్ష్యాలను చేరకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే, జిల్లాలో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుకు అనువైన స్థలాలను ఎంపిక చేయాలని, సత్తుపల్లిలో స్థలం ఖరారైనందున బంక్ ఏర్పాటు పనులు మొదలుపెట్టాలని సూచించారు. ఇక నూతన స్వశక్తి మహిళా సంఘాల ఏర్పాటు, బ్యాంకు లింకేజీ రుణాల మంజూరు, చెల్లింపులపై సూచనలుచేశారు. అడిషనల్ డీఆర్‌డీఓ జయశ్రీ, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

**విపత్తు నిర్వహణ పనులపై నివేదిక**

ఖమ్మం సహకారనగర్: భారీవర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టం, విపత్తు నిర్వహణ నిధుల కింద చేపట్టిన పనులు వివరాలతో నివేదికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ధనసరి అనసూయ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్ నుండి సోమవారం ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భారీ వరదలతో దెబ్బతిన్న కాల్వలు, చెరువులు, కుంటల మరమ్మతుకు కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. వీసీకి జిల్లా నుంచి సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్‌ఓ ఏ.పద్మశ్రీ, డీఏఓ పుల్లయ్య, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈలు వెంకటేశ్వర్లు, యాకోబు, సీపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం**

జిల్లాలో పాలన సాఫీగా సాగడంలో అధికారుల పాత్ర కీలమని అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఆగస్టులో ఉద్యోగ విరమణ చేసిన 10 మంది అధికారులు, ఉద్యోగులను సోమవారం కలెక్టరేట్‌లో వారు సన్మానించారు. ఎస్సీ డీడీ కస్తాల సత్య నారాయణ, ముదిగొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల ఉద్యోగులు చాంద్ పాషా, వెంకటేశ్వరరావు, కొర్ర శివ, సాంబశివరెడ్డి, పూలమ్మ, పి.రాజ్యలక్ష్మి, నరసింహాం, అబ్దుల్ హఫీజ్ తదితరుల సన్మానించాక అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసినా పాలన సాఫీగా సాగేందుకు సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కొడుకులకు భారమైన తండ్రి



ఉన్న ఐదెకరాల భూమిని పంచుకున్న కొడుకులు తండ్రి బాధ్యతను పట్టించుకోకపోవడంతో ఆ వృద్ధుడు న్యాయం కోసం అధికారులను ఆశ్రయించాడు. వైరా మండలం సిరిపురం గ్రామానికి చెందిన వసంతం ఎల్లయ్యకు 94 ఏళ్లు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉండగా, 15 ఏళ్ల క్రితం భార్య చనిపోయింది. ప్రభుత్వ ఉద్యోగులైన ఇద్దరు కుమారులకు ఎల్లయ్య ఐదెకరాల భూమి సమానంగా పంచాడు. కానీ తండ్రిని చూసేందుకు వారు నిరాకరించడంతో ప్రస్తుతం పెద్దకుమార్తె వద్ద ఉంటున్నాడు. పెద్దలు పంచాయితీ నిర్వహించి నెలకు రూ.8వేలు, అరెకరం భూమి ఇవ్వాలన్నా కుమారులు నిరాకరించడంతో న్యాయం చేయాలంటూ సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో అధికారులను వేడుకున్నాడు.

### మాకు న్యాయం చేయండి..



బోనకల్ మండలం గోవిందాపురం(ఏ) గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యులు నిధుల దర్వినియోగంపై కలెక్టరేట్ ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. నెల క్రితం నిధుల విషయమై ఐకేపీ ఎదుట నిరసన తెలపగా.. అప్పటి ఏపీఎం సురేంద్రబాబు సమస్యను గుర్తించారని చెప్పారు. కానీ ఆయన బదిలీ కావడంతో ఏపీఎం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. గ్రామదీపిక కారణంగా సమస్యలు వస్తున్నందున చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని సభ్యులు షేక్ షాజహాన్, షాహీన్, రాధా, కృష్ణమ్మ, కృష్ణవేణి, త్రివేణి తదితరులు కోరారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

### చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెం కాలనికి చెందిన బొడ్డుకృష్ణ(45) చికిత్సపొందుతూ మృతి చెం దాడు. గత నెల 30న ఆయన ప్రమాదవశాత్తు కింద పడగా తలకు తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మంలో చికిత్స అనంతరం వరంగల్ తరలించారు. అక్కడే చికిత్సపొందుతూ సోమవారం మృతిచెందాడు. కాగా, అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా స్తోమత లేక కృష్ణ భార్య, ఒక కుమార్తె దిక్కుతోచని స్థితి ఎదుర్కొంటుండగా ఖమ్మంఅర్బన్ ఎస్‌ఐ శ్రావణ్ రూ.5 వేల నగదు అందజేశారు.